**కథ**

# వ్యక్తిత్వం

**అరుణ**

**చేతివాచీలో టైమ్ చూసుకున్నాడు పరమశివం.**

**సమయం అర్ధరాత్రి ఒంటిగంట అయింది.**

**కళ్లు మూతలు పడుతున్నాయి.**

**'త్వరలో ఇంటికి చేరి నిద్రపోవాలి' అనుకున్నాడు మనసులో.**

ఈరోజు ఒకదాని తర్వాత ఒక కిరాయి ఒప్పుకోవడంతో బాగా ఆలస్యమైంది. ఇక ఈ రోజుకు ఆటోలో ఎవ్వరినీ ఎక్కించుకోకూడదు. నేరుగా ఇంటికి వెళ్లాలి అనిపిస్తోందతనికి.

నిద్రమత్తు వదలడానికి మంచినీళ్లు తాగడం మంచిది అనుకున్నాడు.

ఆటో ఆపి బాటిల్‌లో వున్న మంచినీళ్లు తాగి ఆటో స్టార్ట్ చేయబోయాడు.

ముగ్గురు వ్యక్తులు దగ్గరగా వచ్చారు. ఒక పురుషుడు, పక్కన ఇద్దరు స్త్రీలు వున్నారు.

''టిటిడి కల్యాణమంటపం దగ్గరకు వస్తావా?'' తల కొద్దిగా వంచి అడిగాడతను పరమశివాన్ని.

'ఉహుఁ రాను' అనబోయి ఆగిపోయాడు.

ఒక్క క్షణం ఆలోచించాడు.

కల్యాణమంటపం దగ్గర వీళ్లను దింపేస్తే పక్క రోడ్డులో నుండి ఇంటికి వెళ్లవచ్చు అనుకున్నాడు.

''ఎంతివ్వమంటావు?'' అడిగాడతను.

''పాతిక రూపాయలివ్వండి సార్'' అన్నాడు.

''పదిహేను రూపాయలిస్తాను. వస్తే రా లేకపోతే లేదు'' దూకుడుగా సమాధానమిచ్చాడాయన.

అక్కడి నుండి టిటిడి కల్యాణమంటపం నాలుగు కిలోమీటర్ల పైనే వుంటుంది.

''కుదరదు సార్'' ఆటో స్టార్ట్ చేయబోయాడు.

పక్కన వున్న స్త్రీ కంగారుపడింది. 'ఇపుడు ఈ ఆటో వెళ్లిపోతే మరో ఆటో దొరకడానికి ఎంత టైమ్ పడుతుందో! ఆటో కోసం నిలబడడం నావల్ల కాదు' అనుకుంది మనసులో.

''ఇరవై రూపాయలిస్తాం. వస్తావా?'' అడిగిందామె జోక్యం చేసుకుంటూ.

''ఎక్కండమ్మా!'' అన్నాడు పరమశివం.

''ఇరవై రూపాయలెందుకు దండగ?'' అయిష్టంగా గొణుగుతున్నాడాయన.

''ఫర్వాలేదు వెళదాం. ఇప్పటికే ఆలస్యమైంది'' అందామె.

పక్కన వాళ్ల అమ్మాయి అనుకుంటాను. ఇరవై ఏళ్లు వుంటాయి. సన్నగా, నాజూకుగా కనిపిస్తోంది వీధి దీపం వెలుగులో. అచ్చం సీతలాగా వుంది అనుకున్నాడు తనలో తాను. సీత అతని పిన్నమ్మ కూతురు. పరమశివం దగ్గరే వుండి కాలేజీలో డిగ్రీ చదువుతోంది.

ముగ్గురూ ఎక్కాక ఆటో కదిలింది.

కల్యాణమంటపం ముందు ఆటో ఆపాడు పరమశివం.

అర్ధరాత్రి ముహూర్తం కాబోలు లోపలి నుండి బ్యాండ్ మేళం వినిపిస్తోంది. లైట్లు ధగధగలాడుతూ పట్టపగలులా వుంది.

నిద్రను బలవంతంగా ఆపుకుంటున్నాడతను.

జేబులో నుండి డబ్బు తీసి చిల్లర ఏరుతున్న భర్త వైపు విసుగ్గా చూస్తోందామె.

''నా దగ్గర పదిహేను రూపాయలే చిల్లర వుంది. మిగిలినవన్నీ ఐదు వందల రూపాయలు, వెయ్యి రూపాయల నోట్లు'' అంటున్నాడాయన.

''ఫర్వాలేదు సార్! పదిహేనే ఇవ్వండి'' మనఃస్ఫూర్తిగా అన్నాడు పరమశివం.

''చిల్లర వుంటే బాగుంటుంది కదా డాడీ!'' ఆ అమ్మాయి ఫీలవుతోంది బాధతో.

పది రూపాయల నోటు, రూపాయి బిళ్లలు కలిపి పదిహేను రూపాయలు డ్రైవర్ పరమశివం చేతిలో పెట్టాడు ఆయన.

బ్యాండ్ మేళం ఆగింది.

''చూశావా! చిల్లర లేదనడం వల్ల ఐదు రూపాయలు ఎలా ఆదా చేశానో!'' ముందుకు అడుగులు వేస్తూ ఆయన అంటున్న మాటలు స్పష్టంగా వినిపించాయి పరమశివానికి. మనసులో అసహ్యించుకుంటూనే ఆటో తిప్పుకుని వెళ్లిపోయాడు.

ఇంటిముందు ఆటో ఆగిన చప్పుడుకు కిటికీ రెక్క తెరిచి చూసింది అతని భార్య. వెంటనే తలుపు తెరిచింది చిరునవ్వుతో.

ఆమెలో వున్న ప్రత్యేకత అదే! భార్య ముఖం చూస్తే అలసట ఇట్టే మరిచిపోగలడు అతను.

''మీకోసం ఎదురుచూసి చూసి పాప నిద్రపోయింది'' అంది.

ఆదమరచి నిద్రపోతున్న పాప వైపు తృప్తిగా చూశాడు. పాప పక్కనే సీత పడుకుని వుంది.

బట్టలు మార్చుకుని కాళ్లు చేతులు కడుక్కున్నాడు.

''భోజనం చేద్దురుగాని రండి'' పళ్లెంలో వడ్డించబోయింది.

''ఉహుఁ వద్దు. అర్ధరాత్రి దాటింది. ఉదయం లేచి తింటాను'' వారించాడతను.

''అయితే మజ్జిగ తాగండి'' గ్లాసు అందించింది.

మజ్జిగ తాగి అప్పటికే సిద్ధంగా వేసి వున్న పక్క మీద పడుకున్నాడు.

టేబుల్ ఫ్యాన్ ఆన్ చేసిందామె.

రెండు గదుల ఆ పోర్షన్‌లో భార్యాభర్తలు వంట గదిలోనే కింద పడుకుంటారు.

గాఢనిద్రపోతున్న భర్త వైపు తృప్తిగా చూసి ఆమె కూడా నిద్రకు ఉపక్రమించింది.

తెల్లవారుఝామున ఐదు గంటలకు గట్టిగా కుదిపి లేపిందామె.

''ఏమిటి శోభా! అప్పుడే తెల్లవారిందా?'' కళ్లు తెరవకుండానే అన్నాడు.

''ఆటోలో ఈ బ్యాగ్ కనిపించింది. ఎవరిదో గుర్తుపట్టగలరా?'' అడుగుతోందామె.

ఉలిక్కిపడి కళ్లు తెరిచాడు భార్య మాటలకు.

ఉదయం నిద్రలేచిన వెంటనే వాకిలి శుభ్రం చేసి ముగ్గుపెట్టి, ఆటో తుడిచి ఇంటి పనులు మొదలుపెడుతుందామె ప్రతి రోజూ.

శోభ చేతిలోని బ్యాగ్ అందుకుంటూ కొద్ది క్షణాలు ఆలోచించాడు.

గుర్తు రావడం లేదతనికి.

ఒక బట్టల షాపువాళ్ల గన్నీ బ్యాగ్ అది. బ్యాగ్ లోపల చూశాడు. ఖరీదైన చీర, జాకెట్ వున్నాయి. వాటితో పాటు ఒక న్యాప్‌కిన్ వుంది. న్యాప్‌కిన్‌లో చుట్టిపెట్టిన బాక్స్ తెరిచాడు. కళ్లు జిగేల్మనిపించేలా అందులో నగలు కనిపించాయి. ఎనిమిది గాజులు, చంద్రహారం, ఓ చిన్న గొలుసు, రెండు ఉంగరాలు వున్నాయి.

''ఆఁ.. కల్యాణమంటపం వద్ద ముగ్గుర్ని దింపాను. అర్ధరాత్రి పూట ఆటోలో వెళుతున్నాము గదా అనుకుని ఒంటి మీద నగలు వుండడం మంచిది కాదు అనుకుని బ్యాగ్‌లో తెచ్చుకుని వుంటారు. తీరా ఆటో దిగేటప్పుడు బ్యాగ్ మరిచిపోయి వుండవచ్చు'' అన్నాడు.


''కల్యాణమంటపం దగ్గర వాళ్లదిగారు అంటున్నారు కదా!

లేచి బట్టలు వేసుకున్నాడు. ఆటోడ్రైవర్ వేసుకునే షర్టు కూడా అసంకల్పితంగా తొడుక్కున్నాడు.

బ్యాగ్ వంటగదిలో అటక మీద జాగ్రత్తగా పెట్టాడు.

బయటికి నడవబోతూ తన వంటిమీద వున్న యూనిఫామ్ షర్టు తీసాశాడు.

''ఒక అరగంటలో వస్తాను. తలుపు వేసుకుని పని చేసుకో'' భార్యతో చెప్పి ఆటో స్టార్ట్ చేశాడు.



ఎవరివై వుంటాయి? కొద్ది క్షణాలు ఆలోచించాడు.

చివరిసారిగా కల్యాణమంటపం దగ్గర ముగ్గుర్ని దింపాడు. బహుశా వాళ్లవై వుంటాయి అనుకున్నాడు.

''గుర్తు వచ్చిందా?'' భార్య అడిగింది.

పెళ్లిలో అలంకరించుకోడానికి తీసుకువెళుతూ ఆటోలో మరిచిపోయి వుంటారు పాపం'' అందామె బాధగా.

ఇప్పుడేం చేయాలి? కొద్ది నిమిషాలు ఆలోచిస్తూ వుండిపోయాడతను.

కల్యాణ మంటపానికి కొంచెం దూరంగా ఆటో ఆపి నెమ్మదిగా నడిచి అక్కడికి చేరుకున్నాడు.

అప్పుడే వెలుగురేఖలు పరుచుకుంటున్నాయి. పెళ్లి తంతు ముగిసినట్లుంది.

అర్ధరాత్రి పెళ్లి ముహూర్తమైతే సమీప బంధువులు తప్ప ఈ రోజుల్లో ఎవ్వరూ వుండడం లేదు. రాత్రిపూట తొమ్మిది గంటలకు భోజనాలు చేసి పెళ్లికొడుకును, పెళ్లికూతురుని చూసి వెళ్లిపోతున్నారు చాలామంది. దగ్గర బంధువులు, స్నేహితులు మాత్రమే పెళ్లి చూస్తున్నారు అనుకున్నాడు మనసులో.



అర్ధరాత్రి పూట పని గట్టుకుని వచ్చారు కాబట్టి రాత్రి తన ఆటోలో వచ్చినవారు దగ్గర చుట్టాలై వుంటారు. ఇక్కడ వాళ్లు కనిపిస్తే బాగుండు. మనసులో దైవాన్ని ప్రార్థిస్తూ లోపలికి ప్రవేశించాడు.

అతని రాకను ఎవ్వరూ పట్టించుకోలేదు. అతని కళ్లు వారికోసం వెదుకుతున్నాయి. వాళ్ల ముఖాలు ఎలా వున్నాయో అతనికి గుర్తు రావడం లేదు. వాళ్ల అమ్మాయి సీతలా వుండడం జ్ఞాపకం వచ్చిందతనికి.

ఇరవై ఏళ్ల వయసున్న ఆడపిల్లలు ఓ పదిమంది ఒకచోట కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

వేదిక మీద అక్షింతలు, పువ్వులు విరజిమ్మి వున్నాయి. పురోహితుడు సంచి సర్దుకుంటూ కనిపించాడు.

ఆడపిల్లల వైపు పరిశీలనగా చూశాడు. కానీ సీత పోలికల్లో వున్న అమ్మాయి కనిపించలేదు.

పది అడుగులు ముందుకు వేసి ఓరగా తెరిచి వున్న గదిలోకి తొంగి చూశాడు. కింద పడుకుని బిడ్డకు పాలిస్తోంది ఓ తల్లి. మరో ఇద్దరు ముగ్గురు స్త్రీలు అటువైపు తిరిగి పడుకున్నారు.

వారిని కనుక్కోవడం ఎలా? ఆలోచిస్తూ వెనుదిరగబోయాడతను.

అటువైపు తిరిగి పడుకున్న ఓ స్త్రీ ఒత్తిగిలి ఇటు తిరిగింది. ఆమె ముఖంలోకి చూశాడు. అప్పటివరకు ఏడిచి కళ్లు మూసుకుందేమో అన్నట్లుగా ముఖం వాచి వుంది. పక్కన వున్న మరో స్త్రీ వైపు చూశాడు.

అటు తిరిగి పడుకోవడంతో ఆమె ముఖం కనిపించలేదు. కాని వయసులో చిన్న అమ్మాయిలాగా అనిపించింది వెనుక నుండి చూస్తుంటే. సందేహం లేదు, రాత్రి తన ఆటోలో ఎక్కింది వీరే అనుకున్నాడు.

''అమ్మా!'' అన్నాడు.

అతని వైపు చూసింది బిడ్డకు పాలిస్తోన్న తల్లి. గభాల్న చీర సర్దుకుంది.

''ఆమెను లేపండమ్మా'' అన్నాడు ఇటువైపు వత్తిగిలిన స్త్రీ వైపు చూపుతూ.

''పార్వతక్కా! నీకోసం ఎవరో వచ్చారు చూడు''

కళ్లు తెరిచిందామె.

''ఎవరు?'' అతని వైపు అయోమయంగా చూస్తూ లేచి కూర్చుంది.

''అమ్మా! రాత్రి మీరు పటమటలో ఆటో ఎక్కి పెళ్లికి వచ్చారా?'' అడుగుతున్నాడతను.

ఇంతలో అటువైపు తిరిగి పడుకున్న సీత పోలికలతో వున్న అమ్మాయి లేచింది. సందేహం లేదు. రాత్రి తన ఆటోలో వచ్చింది వీరే అనుకున్నాడు.

అతని వైపు చూస్తూ హఠాత్తుగా లేచి నిలబడ్డారు వారిద్దరూ.

''రాత్రి మేము వచ్చింది మీ ఆటోలోనే కదూ!'' సంభ్రమంగా అడిగింది సీత పోలికలతో వున్న అమ్మాయి.

''అవునమ్మా! నా ఆటోలో మీరేమైనా మరిచిపోయారా?'' అడిగాడు.

''పట్టుచీర, నగలు వున్న బ్యాగ్ ఆటోలో మరిచిపోయాము. అమ్మ దిగాలుగా అర్ధరాత్రి నుండి పెళ్లి చూడకుండా గదిలో పడుకుని ఏడుస్తూనే వుంది'' ఆ అమ్మాయి చెప్పింది.

''అవి మా ఇంట్లో భద్రంగా వున్నాయి. రండమ్మా వెళదాం'' అన్నాడు.

హాలులో కుర్చీలో కూర్చుని కునికిపాట్లు పడుతున్న తండ్రిని లేపి విషయం చెప్పిందామె. సంతోషంతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు వారు ముగ్గురూ. మరో పది నిమిషాల్లో ఆటోలో వారిని తమ ఇంటికి తీసుకువచ్చాడు.

వంటగదిలో అటక మీద భద్రంగా దాచిన బ్యాగ్ తీసి వారికి అందించాడు పరమశివం. సంతోషంతో నగలు తీసి చూసుకుందామె.

జేబులో నుండి ఐదు వందల రూపాయల నోటు తీసి పరమశివానికి ఇవ్వబోయాడాయన.

నవ్వుతూ వారించాడు.

''రాత్రి మీరు నాకు ఐదు రూపాయలు ఇవ్వాల్సి వుంది. ఇప్పుడు మా ఇంటికి తీసుకువచ్చినందుకు పదిహేను రూపాయలు, పటమటలో మీ ఇంటికి చేర్చడానికి ఇరవై రూపాయలు కలిపి మొత్తం నలభై రూపాయలు ఇవ్వండి చాలు'' అన్నాడు.

తమ ఇంటి దగ్గర దింపి నలభై రూపాయలు తీసుకుని వెళుతున్న ఆటోడ్రైవర్ పరమశివం వైపు అలాగే చూస్తూ నిలుచుండిపోయారు వారు కనిపించినంత మేర.

## మంచి కాంబినేషన్!

**కమర్షియల్ చిత్రాలకి కళాత్మక స్పర్శని ఆపాదించే దర్శకుడు గుణశేఖర్ ఇప్పుడు ఉత్తమ హీరో విక్రమ్‌తో కలిసి ఓ సినిమా నిర్మిస్తున్నాడు. అపరిచితుడుకి సంగీతాన్ని అందించిన హారిస్ జయరాజ్ ఈ చిత్రానికి కూడా పనిచేస్తున్నాడు. శేఖర్ జోసెఫ్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నాడు. హిట్ చిత్రం అపరిచితుడు తర్వాత ఎన్నో ఆఫర్లు వచ్చినా ఆచితూచి తన పాత్ర స్వభావాన్ని బట్టి అంగీకారం తెలుపుతున్నాడు విక్రమ్. ఏది ఏమైనా విలక్షణనటనతో మెప్పించే విక్రమ్ ముందు ముందు ఎలాంటి వెరైటీ పాత్రలు ధరిస్తాడో చూడాలి మరి!**